
ప్రజాశక్తి

మంగళవారం 18 ఫిబ్రవరి 2025

5

పార్వతీపురం మన్యం



రైతుబజారులో కూరగాయలను నేరుగా విక్రయించొచ్చు

పార్వతీపురం : రైతులు పండించే కూరగాయలను నేరుగా రైతుబజారులో విక్రయించుకోవచ్చని అగ్రి ట్రేడ్, మార్కెటింగ్ అధికారి ఎల్.అశోక్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. తద్వారా ఆరోగ్య ధరకు తమ కూరగాయలను రైతులు విక్రయించుకోవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో ప్రస్తుతం కూరగాయల సీజన్ అయినందున, అధిక సంఖ్యలో దిగుబడి రావడం, తమ ప్రాంతాల్లో తగినంత గిట్టుబాటు ధర రాక ఇబ్బంది పడుతున్నట్లయితే మీ గ్రామ, మండలాల్లోని ఉద్యాన శాఖ అధికారులు, ఎఎంసి కార్యదర్శులను కలిసి తగిన వివరాలు ఇస్తే, జిల్లాలో గల అగ్రిట్రేడ్ మార్కెటింగ్ శాఖ ద్వారా మీ సరుకును పార్వతీపురంలోని రైతు బజారులో నేరుగా అమ్ముకొనే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కావున రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 91823 61348 మొబైల్ నెంబరును సంప్రదించవచ్చని ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

జర్నలిస్టుపై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి

- కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టు సంఘాల నిరసన
- కలెక్టర్, ఎస్‌పిలకు వినతులు

ప్రజాశక్తి - పార్వతీపురం

మక్కువ మండలం ప్రజాశక్తి విలేకరి ఎం.రామారావుపై దాడి చేసిన మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అనుచరుడు, మండల టిడిపి అధ్యక్షులు గుల్ల వేణుగోపాలనాయుడును వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యాన మన్యం జిల్లా జర్నలిస్టులు సోమవారం విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టరేట్ల వద్ద నిరసనలు తెలిపారు. పార్వతీపురంలో జరిగిన ధర్నాకు ఎపిడబ్ల్యు జెఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.రమేష్ నాయుడు, ఎపిడబ్ల్యుజెయు నాయకులు గంగి శ్రీనివాసరావు, కిశోర్ ఆధ్వర్యాన అన్ని మండలాల నుంచి వచ్చిన జర్నలిస్టులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టిడిపి నాయకుడు వేణుగోపాల్ నాయుడు విలేకరి రామారావుపై దాడి చేసి చంపుతానని బెదిరించడం దారుణమని అన్నారు. ఈ దాడి పత్రికా స్వేచ్ఛను హరించడమే అవుతుందని చెప్పారు. పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు పల్ల సురేష్ జర్నలిస్టుల ఆందోళనకు మద్దతు పలికారు. అనంతరం కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. దాడికి పాల్పడిన టిడిపి నాయకుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. విచారించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు మంతిన రమేష్, పట్నాయక్, రామకృష్ణ, నాగు, వెంకటరమణ, పోలినాయుడు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి విలేకరిపై దాడి అమానుషం

గుమ్మలక్ష్మీపురం : మన్యం జిల్లా మక్కువ మండలం విలేకరి రామారావుపై మండల టిడిపి అధ్యక్షులు దాడి చేయడం అమానుషమని, అతనిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చూసుకోవాలని గుమ్మ లక్ష్మీపురం ఏజెన్సీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సవరపు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విలేకరిపై దాడి చేయడంటే పత్రికా స్వేచ్ఛను హరించినట్లేనని పేర్కొన్నారు. విలేకరులపైనా, దాడులకు పాల్పడిన వారిపై ప్రభుత్వం, పోలీసులు కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోకుంటే దశలవారీగా పోరాటం చేస్తామని హెచ్చరించారు.

పార్వతీపురం రూరల్ : జర్నలిస్టులపై దాడులు దుర్మార్గమని పార్వతీపురం జర్నలిస్ట్ ఫోరం (ప్రెస్ క్లబ్) జిల్లా అధ్యక్షులు వి.దాలినాయుడు అన్నారు. మక్కువ ప్రజాశక్తి విలేకరి రామారావుపై టిడిపి నాయకుడి దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కూటమి పాలన వచ్చాక జిల్లాలో జర్నలిస్టులకు బెదిరింపులు ఎక్కువయ్యాయన్నారు. తక్షణమే దాడి చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా కలెక్టర్, ఎస్‌పి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

జర్నలిస్టుపై దాడిని ఖండిస్తున్నాం : ఎస్ఎఫ్ఐ

పార్వతీపురం: ప్రజాశక్తి విలేకరి రామారావుపై టిడిపి నాయకుడి దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దేవిరాజు, హెచ్ సింహాచలం చెప్పారు. దాడికి పాల్పడిన టిడిపి నాయకులు గుల్ల వేణుగోపాల్ నాయుడిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

పార్వతీపురం టౌన్: విలేకరి రామారావుపై మక్కువ టిడిపి అధ్యక్షుడు దాడి చేయడం అమానుషమని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు భీమరాజు అన్నారు. జర్నలిస్టును చంపుతాననడం దుర్మార్గమన్నారు. గతంలో ఈ ప్రాంతం నుంచి పెద్ద నాయకులు మంత్రులుగా పని చేశారని, ఎప్పుడూ ఇలాంటి సంఘటనలు చూడలేదని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి అండ చూసుకొని ఆమె ప్రధాన అనుచరుడు వేణు గోపాలనాయుడు రామారావుపై దాడి చేయడం పత్రిక స్వేచ్ఛను హరించడమే అన్నారు.



కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు సంఘటనను వివరిస్తున్న యూనియన్ నాయకులు



ఎస్‌పి మాధవరెడ్డికి వినతిని అందజేస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు

ఉపాధ్యాయుల గొంతుక విజయగౌరిని గెలిపించండి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈనెల 27న జరగబోయే శాసన మండలి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల్లో ఉపాధ్యాయుల గొంతుకగా నిలిచే కోరెడ్ల విజయగౌరిని ఎమ్మెల్సీగా గెలిపించాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ పిలుపునిచ్చారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్)గా శాసనమండలిలో ఉపాధ్యాయుల, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి, విద్యారంగ పరిరక్షణకు శక్తివంచన లేకుండా పనిచేశామని, ప్రభుత్వాలను నిలదీశామని అదే ఒరవడిని విజయగౌరి కొనసాగిస్తారని చెప్పారు. ఆమెకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి శాసనమండలికి పంపించాలని, అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయులు, అధ్యాపకులను కోరారు. గత 8ఏళ్లుగా శాసన మండలిలో ఉత్తరాంధ్ర వాణి వినిపించే వారు కరువయ్యారని, అది పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించుకోవడం ద్వారానే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాము మద్దతు ఇచ్చే అభ్యర్థులను గెలిపించాలని, అందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపు ఇచ్చారని, కానీ వారి అభ్యర్థులు ఎవరో పేర్లు చెప్పలేకపోయారని అన్నారు. అందుకు కారణం పోటీలో ఉన్న అభ్యర్థులు టిడిపి వారిమని చెప్పుకోవడానికి భయపడుతున్నారా, లేక చంద్రబాబే పలానా వ్యక్తి తమ అభ్యర్థి అని చెప్పుకోవటానికి భయపడు తున్నారా అని ఆయన ప్రశ్నించారు. అధికార పార్టీకి అనుకూలంగా ఉండి లాబీయింగ్ ద్వారా సమస్యలు పరిష్కరిస్తామని చెప్పుకుంటున్నారని, గత ప్రభుత్వం అనుసరించిన విధానాలే కూటమి ప్రభుత్వం కూడా అమలు చేస్తోందని చెప్పారు. అలా అయితే సాల్ట్ ఒప్పందం ద్వారా పాఠశాలల నిర్వీర్యానికి పూనుకొంటున్నారని, దీన్ని మంత్రులకు చెప్పి ఆపగలరా అని ప్రశ్నించారు. ఉపాధ్యాయ తమ సమస్యల పరిష్కారంతో పాటు విద్యారంగ పరిరక్షణకు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పోరాడుతున్నారని అందుకు ప్రజా ఉద్యమాలే దోహదపడగలవని చెప్పారు. అటువంటి పోరాటాలు నిర్మించడంలోనూ, అండగా నిలబడడంలోనూ పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఎప్పుడూ ముందుంటారని, కావున పిడిఎఫ్ తరపున పోటీ చేస్తున్న కోరెడ్ల విజయగౌరికి ప్రథమ ప్రాధాన్యతా ఓటు తో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు చాలా దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని, కోవిడ్ సంక్షోభంలో వారు ఉపాధిని కోల్పోయారని గుర్తుచేశారు. కనుక వారికి ప్రభుత్వం హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, సంక్షేమ పథకాలు అందించాలని, ఉద్యోగ విరమణ తర్వాత పెన్షన్ ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వ సమయంలో పిడిఎఫ్ సభ్యులు శాసన మండలిలో ఈ అంశాలపై డిమాండ్ చేయగా పరిశీలిస్తామని చెప్పారని, కావున ప్రభుత్వం వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి

విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి శాసనమండలిలో పోరాడతానని పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. కంచిలి, మందస, టెక్కలి మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలు, కెజిబివిలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈనెల 27న నిర్వహించనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులు, అధ్యాపకులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు, నాయకులు జి.రమేష్, ఎన్.రవి, త్రినాథ్, దాసరి ఈశ్వరరావు, సనపల స్వప్న, కె.దాలయ్య, పాలవలస ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

విజయ గౌరిని గెలిపించాలని ప్రచారం

వీరఘట్టం : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని సోమవారం యుటిఎఫ్ జిల్లా మహిళా నాయకులు ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలతో పాటు రేగులపాడులోని కెజిబివి పాఠశాలలను సందర్శించి మీ మొదటి ప్రాధాన్యత ఓటు విజయ గౌరికి వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఉపాధ్యాయ ఓటర్లను కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు జ్యోతి, రాష్ట్ర కౌన్సిలర్ రాజ కుమారి, జిల్లా కార్యదర్శి గోవిందమ్మ, రాజమణి, విశాలాక్షి, చంద్రకళ పాల్గొన్నారు.



అధ్యాపకులనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రమణ్యం

శాసనమండలిలో ప్రశ్నించే గొంతుక పిడిఎఫ్

మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శాసనమండలిలో ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యలపై ప్రశ్నించేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలేనని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం అన్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల అధ్యాపకులు, కాంట్రాక్టు అధ్యాపకులతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విద్యా విధానంపై తీవ్ర దాడి జరుగుతోందన్నారు. ప్రభుత్వ విధానాలు ప్రయివేట్‌ను ప్రోత్సహించేలా ఉన్నాయని విమర్శించారు. ప్రభుత్వం కళాశాలలో కొత్త కోర్సులు, సిబ్బంది నియమాకం, మౌలిక వసతులు కల్పించకపోవడంతో విద్యార్థుల డ్రాపౌట్స్ పెరుగుతున్నాయని చెప్పారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీల పోరాటం ఫలితంగానే కాంట్రాక్టు అధ్యాపకుల వేతనాలు పెరిగాయని గుర్తు చేశారు. రాజకీయ పార్టీల తరుపున గెలిచే వ్యక్తులను శాసనమండలికి పంపితే వారిపై ఆయా పార్టీల పెత్తనం ఉండడంతో, వారు సమస్యలపై మాట్లాడే అవకాశం ఉండదన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విజయగౌరిని గెలిపిస్తే ఆమె స్వతంత్రంగా వ్యవహరించి సమస్యలపై పోరాడతారని చెప్పారు. ఆయన వెంట జెవివి నాయకులు మురళీధర్, ఉద్యోగ సంఘాల నాయకులు కె.శ్రీనివాసు, కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నాయకులు శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

సహకార సంఘాల ద్వారా మెరుగైన సేవలు

ప్రజాశక్తి - పార్వతీపురం

సహకార సంఘాల ద్వారా మెరుగైన సేవలు అందజేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. 2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం నిర్వహణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం తన కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మట్లాడుతూ సుస్థిర ఆర్థికాభివద్ధి, మెరుగైన ప్రపంచాన్ని నిర్మిస్తాయనే నినాదంతో సహకార సంవత్సరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ప్రాథమిక సహకార సంఘాల బలోపేతం చేయాలని, వాటికి గ్రేడింగ్ ఇవ్వాలని సూచించారు. పిఎసిఎస్‌ల వ్యాపార కార్యకలాపాల విస్తరణ జరగాలన్నారు. మత్స్యకార, చేనేతకార, గొర్రెల పెంపకం సంఘాలను ఏర్పాటు చేసి వాటి అభివృద్ధికి గల పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు. సహకార కార్యక్రమాలు, జిల్లాలోని వివిధ కార్యక్రమాలను డిజిటల్ వాన్‌ల్లో ప్రదర్శించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా సహకార అధికారి పి శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ ఏడాదిలో ప్రతినెలా నిర్వహించనున్న వివిధ కార్యక్రమాలను ప్రకటించారు. సమావేశంలో నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి డిఎస్ దినేష్ కుమార్‌రెడ్డి, విజయనగరం, శ్రీకాకుళం డిసిసిబిల జనరల్ మేనేజర్లు కెవివిఆర్ఎన్ సత్యనారాయణ, ఎస్‌విఎస్ జగదీష్, శ్రీకాకుళం జెడ్పీ సిఇఒ ఎల్ఎన్‌బి శ్రీధర్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

సిడిపిఒలకు వినతులు

ప్రజాశక్తి - బలిజిపేట

అంగన్వాడీ సమస్యలు, సమ్మె హామీలు, మినిట్స్ కాపీలకు జీవోలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సిడిపిఒ సులేఖకు సోమవారం అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట జ్యోతిలక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీలు చేసిన సుదీర్ఘ పోరాటానికి నేటి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్‌రెడ్డి తన పాదయాత్ర సందర్భంలో అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చి, అమలు చేయకపోవడంతో 42 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా చారిత్రాత్మకమైన పోరాటం చేపట్టారని, సుదీర్ఘ పోరాట సందర్భంలో జులైలో వేతనాలు పెంచుతామని, అలాగే మరో 11 డిమాండ్లను పరిష్కరిస్తామని మినిట్స్ కాపీ ఆధారంగా హామీ ఇచ్చారని తెలిపారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మినిట్స్ కాపీ హామీలు అమలు చేయాలని కోరుతూ అనేక దఫాలుగా మంత్రులను, ముఖ్యమంత్రికి విన్నవించుకున్నామని, కాని నేటికీ ఏ ఒక్క సమస్యను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం అన్యాయమని మండిపడ్డారు. తక్షణమే పెండింగ్లో ఉన్న సెంటర్ బిల్లులు, టిఎ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, రానున్న బడ్జెట్ సమావేశాల్లో అంగన్వాడీ సమస్యలపై చర్చించాలని, అంగన్వాడీల జీతాలు పెంచాలి, మినీలకు జీవోలు విడుదల చేయాలని, హెల్పర్ల ప్రమోషన్లలో రాజకీయ జోక్యం అరికట్టాలని, సంక్షేమ పథకాలు, గ్రాడ్యుయేట్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అంగన్వాడీ ప్రాజెక్ట్ సెంటర్ల వద్ద ధర్నాలు నిర్వహించాలని రాష్ట్ర యూనియన్ పిలుపునిచ్చిందని, ఈ పిలుపులో భాగంగా వినతి పత్రం ఇస్తున్నామని, సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్టు నాయకులు కె.దాలమ్మ, సావిత్రి, స్వర్ణ, శైలజ, లక్ష్మి, యశోద, రవణమ్మ, తదితరులు పాల్గొన్నారు

పాలకొండ : తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు సోమవారం సామూహిక వినతిపత్రాలను అధికారులు అందజేశారు. మధ్యాహ్న భోజన సమయంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.హిమప్రభ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అంగన్వాడీలు చేసిన సుదీర్ఘ పోరాటానికి అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి ఇంతవరకు అమలుచేయలేదన్నారు. గత జులైలో జీతాలు పెరగాల్సిన ఉన్నా ఇంతవరకూ పెంచలేదన్నారు. దీంతో వారు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షులు అమరవేణి, జి.శారద, కె.శారద, ఎన్.శ్యామల, ఎం.శ్రీదేవి, మణి, గంగమ్మ, ధనలక్ష్మి తదితరులు ఉన్నారు.

పార్వతీపురం రూరల్ : అంగన్వాడీ కార్యకర్తలకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్ యూనియన్ నాయకులు ఎం.గౌరి, కె.రాజేశ్వరి, వి.ఇందిర డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఐసిడిఎస్ సిడిపిఒ శ్రీనివాసరావుకు వినతి అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పేరుకుపోయిన అంగన్‌వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యకర్తలు, హెల్పర్ల ప్రమోషన్లలో రాజకీయ జోక్యం అరికట్టాలని, సంక్షేమ పథకాలు, గ్రాడ్యుయేట్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీదేవి, గిరిజ, చెన్నమ్మ, అశ్విని తదితరులు పాల్గొన్నారు.



బలిజిపేటలో సిడిపిఒకు వినతిని అందజేస్తున్న అంగన్వాడీలు



పాలకొండలో సిడిపిఒకు వినతిని అందజేస్తున్న అంగన్వాడీలు



పార్వతీపురంలో సిడిపిఒకు వినతిని అందజేస్తున్న అంగన్వాడీలు

చైర్మన్ ఎన్నిక మళ్లీ వాయిదా

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక మళ్లీ మొదటికే వచ్చింది. ఈ ఎన్నికకు కోరం లేక మొదటి నుంచి వాయిదా పడుతూనే వస్తుంది. నగర పంచాయతీలో సంఖ్యాబలం వైసిపికి ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో ఇరు పార్టీలు పంతానికి పోతుడడంతో సోమవారం జరగాల్సిన ఎన్నిక వాయిదా పడింది. ఎన్నికల అధికారి సబ్ కలెక్టర్ యశ్వంత్ రెడ్డి, ఎన్నికల పరిశీలకులు జాయింట్ కలెక్టర్ శోభిక స్థానిక నగర పంచాయతీలో ఉదయం 11 గంటలకు ఎన్నికకు సిద్ధమయ్యారు. అయితే టిడిపికి చెందిన ముగ్గురు, జనసేనకు చెందిన మరో కౌన్సిలర్, చైర్మన్ పదవిని ఆశిస్తూ ఇటీవలే టిడిపి కండువా కప్పుకున్న రెండో వార్డ్ కౌన్సిలర్ ఆకుల మల్లేశ్వరి సమావేశానికి హాజరయ్యారు. ఉదయం 11.30 సమయంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని మల్లేశ్వరి రాతపూర్వకంగా సబ్ కలెక్టర్‌కు దరఖాస్తు ఇవ్వగా, కోరం లేకుండా నామినేషన్ తీసుకోవడం జరగదన్నారు. మధ్యాహ్నం 12 గంటల అయినా మిగతా కౌన్సిలర్లు హాజరు కాకపోవడంతో కోరం లేక మంగళ వారానికి ఎన్నికవాయిదా వేస్తున్నట్లు సబ్ కలెక్టర్ ప్రకటించారు. చైర్మన్ ఎన్నికను అటు కూటమి, ఇటు వైసిపి ప్రతిష్టాత్మంగా తీసుకున్నాయి. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి తమపార్టీ కౌన్సిలర్లను సమావేశానికి వెళ్లకుండా విప్ జారీ చేసి కూటమి పార్టీని ఇరకాటంలో పెట్టారు. మరోపక్క కూటమి పార్టీలు కూడా ఈ ఎన్నికను ప్రతిష్టాత్మంగా తీసుకుంటు న్నాయి. ఎమ్మెల్యే జయకృష్ణ కూటమికి చైర్మన్ పదవి వచ్చేలా చాపకింద నీరులా ప్రయత్నించినప్పటికీ ఆ ప్రయత్నాలన్నీ బెడిసికొట్టాయి.



వైసిపి కౌన్సిలర్ల గైర్హాజరుతో ఖాళీగా ఉన్న కుర్చీలు

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి : ఎస్‌పి

పార్వతీపురంరూరల్: పోలీసులు వృత్తి నైపుణ్యం పెంపొందించుకుని మెరుగైన సేవలందించాలని ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి సూచించారు. జిల్లా సాయుధ పోలీసులకు 15రోజులపాటు నిర్వహించే పునశ్చరణ తరగతులను స్థానిక జూనియర్ కళాశాలలో మైదానంలో సోమవారం ఆయన ప్రారంభించారు.అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ ఎఆర్ సిబ్బందికి ప్రతా ఏటా మొబలైజేషన్ కార్యక్రమం నిర్వహించి విధుల్లో నైపుణ్యం, ఫిజికల్ ఫిట్ నెస్ ను మెరుగుపరచడం ఆనవాయితీగా వస్తోందన్నారు. విధుల్లో నైపుణ్యాన్ని సాధించేందుకు ఆర్మడ్ రిజర్వు పోలీసులు పున:శ్చరణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమం లో ఎఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి, ఆర్ఐలు పాల్గొన్నారు.

జిబిఎస్‌పై అప్రమత్తం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

గులియబుల్ బారే సిండ్రోమ్ (జిబిఎస్) పై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. వివిధ అంశాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ను సోమవారం నిర్వహించారు. జిబిఎస్‌పై ప్రజలు, అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వైద్య, పంచాయతీరాజ్ శాఖలు మరింత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. వైద్యులు, వైద్య సిబ్బంది అన్ని వేళలా అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. పారిశుధ్యం ఎప్పటికప్పుడు చూడాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కీటక జనిత వ్యాధుల నమోదు యాప్‌లో వచ్చిన అంశాల పట్ల ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. గృహ నిర్మాణ పనులు వేగవంతం కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఇల్లు ఒక దశ నుంచి మరో దశకు మార్పు చేసేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బలిజిపేట, సాలూరు మండలాల్లో ఎంఎస్ఎంఇ సర్వే జాప్యం జరుగుతోంద న్నారు. పిఎం సూర్య ఘర్ పథకం కింద ఎక్కువ మంది నమోదుకు కృషి చేయాలన్నారు. గోకులాల నిర్మాణం, ఇంకుడు గుంతలు ఏర్పాటుపై చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.

స్వచ్ఛ సుందర పార్వతీపురం సాధిద్దాం

జిల్లాలోని అన్ని మున్సిపాల్టీల్లో అందుబాటులో ఉండే వనరులతో స్వచ్ఛతకు పెద్దపీట వేసి స్వచ్ఛ సుందర పార్వతీపురంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ అధికార యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు. స్వచ్ఛ సుందర పార్వతీపురం అందరి బాధ్యత అని, ఇందుకు మనకున్న వనరులతో ముందుగా స్వచ్ఛత వైపు అడుగులు వేయాలన్నారు. జిల్లాలో సంపద కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. చెత్తను సేకరించేందుకు మునిసిపాలిటీ, సచివాలయ సిబ్బందిని వినియోగించుకోవచ్చని సూచించారు. మున్సిపాల్టీ పరిధిలో ప్రతి వంద ఇళ్ల నుంచి చెత్తను సేకరించేందుకు మూడు చక్రాల వాహనాలను అందుబాటులో ఉంచాలని, అవసరమైతే రెండు సార్లు తిరిగైనా చెత్తను సేకరించాలన్నారు. చెత్త నుంచి సంపద సృష్టికి మార్చి 1 నుంచి మాస్టర్ ట్రైనీలతో శిక్షణ ఇప్పించారు. సమావేశంలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ కె.హేమలత, జట్టు ఆశ్రమ సభ్యులు వి.పద్మజ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

అత్యవసరమైనా వైద్యం చేయరా?

- కూనేరు రామభద్రపురం పిహెచ్‌సిలో వైద్యుల నిర్లక్ష్యం
- 108 వాహనంలోనే ప్రసవం

ప్రజాశక్తి - కొమరాడ

ఏజెన్సీలో ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక ప్రభుత్వం దృష్టి సారిస్తున్నప్పటికీ వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో కొన్ని ఘటనల్లో ప్రాణాలు పోతున్నాయి. అయినప్పటికీ సిబ్బంది, వైద్యులు తీరు మారడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని కూనేరు రామభద్రపురం పిహెచ్‌సిలో ఆదివారం రాత్రి దారుణ ఘటన చోటుచేసుకుంది. మండలంలోని ఎండభద్రకు చెందిన చిలకమ్మ పురిటి నొప్పులతో పిహెచ్‌సికి ప్రసవానికి వచ్చింది. ఇక్కడ డెలివరీ అవ్వదని, పార్వతీపురం వెళ్లిపోవాలని సిబ్బంది, వైద్యులు చెప్పడంతో గిరిజనులు ఆవేదనకు గురయ్యారు. పురిటి నొప్పులు అధికమయ్యాయని, ఇక్కడే ప్రసవం చేయండని గిరిజనులు వైద్యులను కోరినా పట్టించుకోకపోవడంతో చేసేదేమీ లేక 108 వాహనంలో ఆమెను పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. మార్గ మధ్యలో అంబులెన్స్‌లోనే చిలకమ్మ ప్రసవించింది. ఎటువంటి అవాంఛనీయ ఘటనా జరగకపోవడంతో కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు.

కనీసం ప్రథమ చికిత్సా చేయరు..

మండలంలోని కోనేరు రామభద్రపురం పిహెచ్‌సి 24 గంటలూ వైద్య సేవలు అందించేలా అవకాశం ఉన్నప్పటికీ అక్కడ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఏ చిన్న రోగంతో ఆస్పత్రికి వచ్చినా కనీసం పరీక్షించకుండానే జిల్లా ఆస్పత్రికి తరలించడంపై ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి కనీసం ప్రథమ చికిత్స కూడా చేయకుండా జిల్లా ఆసుపత్రికి తరలించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రిలో వైద్యులు సమయపాల పాటించకపోవడంతో సిబ్బంది కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పగటిపూట కూడా వైద్యులు వివిధ గిరిజన ప్రాంతాల నుంచి వస్తున్న గిరిజనులకు సక్రమంగా వైద్య సేవలు అందించడం లేదని ఇప్పటికే వారంతా అనేక సందర్భాల్లో గగ్గోలు పెడుతున్న విషయం తెలిసిందే. ఏది ఏమైనా గిరిజనులకు వైద్య సేవలు అందించాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని ఇకనైనా వారు తీరు మార్చుకొని ప్రజలకు వైద్య సేవలు అందించే విధంగా చర్యలు చేపట్టాలని గిరిజన ప్రజలు కోరుతున్నారు.



108 ప్రసవించిన బిడ్డను కుటుంబ సభ్యులకు అందిస్తున్న సిబ్బంది

పేదల ఇళ్లు కూల్చివేత అడ్డగింత

● కోర్టు ఉత్తర్వులతో రంగంలోకి టౌన్ ప్లానింగ్ అధికారులు ● అడ్డుకున్న పౌర సంక్షేమ సంఘం

ప్రజాశక్తి- సాలూరు

మున్సిపాలిటీ పరిధిలోని 29 వార్డులో వున్న రైల్వే స్టేషన్ రోడ్డులో పేదల పూరిళ్ళను కూల్చేందుకు మున్సిపల్ అధికారులు సోమవారం ఉదయం ప్రయత్నించారు. కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న పేదల ఇళ్ళను కూల్చేందుకు యత్నించారు. అయితే పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి ఎన్వై నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఇళ్లను కూల్చేందుకు తీసుకొచ్చిన జెసిబిని అడ్డుకున్నారు. దీంతో కొంత సమయం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసుల సహకారంతో పూరిళ్ళను కూల్చడానికి చేసిన ప్రయత్నాలను పేదలు సైతం అడ్డుకున్నారు. 2023లో కరాసు అప్పారావు అనే రైతు కోర్టు కెళ్ళడంతో తీర్పు ఆయనకి అనుకూలంగా వచ్చింది. పేదల ఇళ్ళ వెనుక ఉన్న తన వ్యవసాయ భూమిలోకి వెళ్ళేందుకు దారి లేకుండా ప్రభుత్వ స్థలంలో ఇళ్ళు నిర్మించారని, తన వ్యవసాయ పనులకు ఆటంకం కలుగుతోందని రైతు అప్పారావు కోర్టుని ఆశ్రయించారు. ప్రభుత్వ స్థలంలో వున్న పేదల ఇళ్ళను కూల్చేయాలని కోర్టు ఇచ్చిన తీర్పుని గతంలో మున్సిపల్ అధికారులు అమలు చేయలేదు. దీంతో ఆయన మళ్ళీ కోర్టుని ఆశ్రయించి కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో కోర్టు మరోసారి


జెసిబి ముందు బైఠాయించి నిరసన తెలుపుతున్న నాయకులు, పేదలు

తీర్పు ఇచ్చింది. రైతు అప్పారావు భూమికి వెళ్ళేందుకు అడ్డుగా వున్న పేదల ఇళ్ళను కూల్చేయాలని కోర్టు మున్సిపల్ అధికారులను ఆదేశించింది. దీంతో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కమిషనర్ సత్యనారాయణ ఆధ్వర్యాన పేదల ఇళ్ళు కూల్చేందుకు యత్నించారు. 31 ఇళ్ళకు సంబంధించిన పేదలు తీవ్రంగా ప్రతిఘటించడంతో కూల్చివేత పనులు నిలిచిపోయాయి. అయితే రైతు అప్పారావు భూములోకి వెళ్ళేందుకు వీలుగా నిరుపయోగంగా ఉన్న రెండు పూరిళ్ళను తొలగించారు. అనంతరం పేదలు కమిషనర్ సత్యనారాయణకు వినతిపత్రం ఇచ్చారు.వారికి అక్కడే ఇంటి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పేదల ఇళ్ళకు 14వ ఆర్థిక సంఘం నిధులతో కాలువలు నిర్మించారని ఎలా తొలగిస్తారని పౌర సంక్షేమ సంఘం నాయకులు ప్రశ్నించారు. కూల్చి వేత పనులు తాత్కాలికంగా ఆగడంతో పేదలు ఊపిరి పీల్చుకున్నారు.

హైదరాబాద్, తిరుపతికి రైళ్లు నడపాలి

పార్వతీపురంరూరల్ : పార్వతీపురం జిల్లా కేంద్రమైందని, ఆ స్థాయిలో రైల్వేస్టేషన్లో అభివృద్ధి, రైలు సౌకర్యం కల్పించాలని స్థానిక ఎమ్మెల్యే బి.విజయచంద్ర ఈస్ట్ కోస్ట్ రైల్వే జిఎం పరమేశ్వర్ ఫక్వాల్ను కోరారు. అమృతభారత్ పథకంలో భాగంగా రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించేందుకు వచ్చిన ఆయన్ను ఎమ్మెల్యే కలిసి సమస్యలను వివరించారు. రాయగడ నుంచి పార్వతీపురం మీదగా హైదరాబాదు, తిరుపతి ప్రాంతాలకు రెండు ట్రైన్లు నడిపించాలని కోరారు. బెలగాం ప్రాంతంలో రైల్వేగేట్ పెడితే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కావున ఫ్లై ఓవర్, అండర్ బ్రిడ్జ్ సాంకేతిక నిర్మించాలని కోరారు.

నులి పురుగు మాత్రలు పంపిణీ

వీరఘట్టం: మండల కేంద్రంలోని కోమటి వీధి పాఠశాలలో సోమవారం విద్యార్థులకు నులిపురుగు మాత్రలను స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి పంపిణీ చేశారు. జాతీయ డి వార్మింగ్ డే సందర్భంగా గతంలో మాత్రుల వేయని పిల్లలను గుర్తించి వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి. అన్నాజీరావు, ఎంపిహెచ్ఇఒ జనార్ధన్ రావు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఎండిఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - మక్కువ

ప్రభుత్వ బడులను బలోపేతం చేసే పనిలో ప్రధాన భూమిక పోషిస్తున్న మధ్యాహ్న భోజనం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని ఎపి మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి శాంతి విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భోజన నిర్వాహకుల వేతనాలు పెంచాలని, పెరిగిన ధరలకు తగ్గట్టుగా విద్యార్థుల మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మక్కువలో జరిగిన భోజన నిర్వాహకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. భోజన నిర్వాహకులకు ప్రతినెలా రెగ్యులర్గా జీతాలు బిల్లులు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, పెరిగిన ధరలకు తగ్గట్టుగా భోజన నిర్వాహకుల జీతాలు పెంచాలని, అన్ని పాఠశాలలకు వంట గదులు, పనిముట్లు, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, టిఎ, డిఎలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై మార్చి 10న కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామన్నారు. సిఐటియు మండల అధ్యక్షులు ఎల్.దాలమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు కృష్ణ, గౌరమ్మ ప్రజాసంఘాల నాయకులు కృష్ణ, తాడంగి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

జీడి మొక్కలను తొలగించొద్దు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మండలంలోని సంఘవలస పంచాయతీ సీతంపేట గ్రామం గిరిజన రైతుల సాగు చేస్తున్న భూములలో జీడి మొక్కలను ఫారెస్ట్ అధికారులు తొలగిస్తున్నారని, ఆ తొలగింపు చర్యలను ఆపాలని సోమవారం జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్కు రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, ఉయిక ముత్యాలు, శ్రీను నాయుడు, మోహనం భాస్కరరావు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 50 గిరిజన రైతు కుటుంబాలు 25 సంవత్సరాలుగా పోడు భూముల్లో వ్యవసాయం సాగు చేసుకుంటూ జీవిస్తున్నాయని,ఈ భూములకు పట్టాల మంజూరు చేయమని చాలా సంవత్సరాలుగా ఐటిడిఎ పిఒలకు వినతులు కూడా సమర్పించామని గుర్తు చేశారు. ఈ విషయంపై పలుమార్లు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలను కూడా కలిశామన్నారు. అయినప్పటికీ ఫారెస్ట్ అధికారులు తమపై అక్రమ కేసులు బనాయించి మొక్కలను జెసిబి సహాయంతో తొలగించే కార్యక్రమం చేపడుతున్నారని, ఆ చర్యలను తక్షణం కలెక్టర్ ఆపించాలని కోరారు.

20న మున్సిపల్ మార్కెట్ ఆశీల వేలం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఈనెల 20న మున్సిపల్ మార్కెట్ ఆశీలు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు కమిషనర్ సి.హెచ్. వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, 2025-26 ఆర్థిక సంవత్సరంలో సంబంధించి ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు రోజువారీ మార్కెట్, రోడ్డు మార్జిన్లో ఆశీలు వసూలు చేసుకోవడంతో పాటు, కబేళాలో ఆశీలు వసూలు చేసుకొనే హక్కును ఇవ్వడంకు ఈ వేలం వేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఈనెల 20న స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్, రెవెన్యూ విభాగం అధికారుల ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించబడునని, ఈ వేలం పాటలో పాల్గొనే పాటదారులు రూ.10 లక్షలకు సంబంధించిన సాల్వెన్సీ సర్టిఫికెట్ (మునిసిపల్ కమిషనర్, తహశీల్దార్), రూ.4లక్షల ధరావత్తును తీసుకొని హాజరుకావాలని అన్నారు.

నూనె గింజల పంటల క్షేత్ర సందర్శన

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని రాయిగుడ్డి వలస రైతు సేవా కేంద్రం పరిధిలో గల రాయిగుడ్డివలస, నీలంవలస, సరాయివలస గ్రామాల రైతులకు నూనె గింజల పంటలపై అవగాహన కోసం పార్వతీపురం,సీతానగరం మండలాల్లో గల నూనె గింజల పంటల క్షేత్రాల సందర్శన సోమవారం జరిగింది. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్ పథకంలో భాగంగా సాంకేతిక సహాయకులు ప్రసన్నారాణి ఆధ్వర్యంలో వేరుశనగ, నువ్వులు, పొద్దు తిరుగుడు, ఆయిల్ పాం, నిమ్మగడ్డి పంటల సాగు క్షేత్రాలను సందర్శించి సాగులో మెలకువలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు, జిల్లా వ్యవసాయ కార్యాలయ విస్తరణాధికారి బి.వివి, ఎవిఎ సాయి గణేష్, గ్రామ ఉద్యాన సహాయకులు శ్రీప్రియ, రైతులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులన్నీ పూర్తి చేయండి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మ వలస మండలంలోని ప్రభుత్వం నిర్దేశించిన పనులన్నీ సకాలంలో పూర్తి చేయాల్సిందేనని ఎంపిడిఒ శంబంగి రమేష్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం ఆయన గెడ్డతిరువాడ సచివాలయాన్ని సందర్శించిన ఆయన ముందుగా విక్టర్ హైజాన్ యాప్లో పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలని అన్నారు. అలాగే ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో 300 యూనిట్లు పైబడిన వినియోగదారులను గుర్తించి వారి పేర్లను నమోదు చేయించారు. అనంతరం ఎస్ఎంఎస్సీ సర్వే కింద 36 మందిని గుర్తించి అప్లోడ్ చేయించారు. ఎస్డబ్ల్యూ పిసి షెడ్ పనులను పరిశీలించి అసంపూర్తిగా ఉన్న పనులను వారం రోజుల్లోగా పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.

ఎమ్మెల్సీకి తమ్మినేని పరామర్శ

ప్రజాశక్తి - పాలకొండ

ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ను సోమవారం మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం పరామర్శించారు. ఇటీవల విక్రాంత్ తండ్రి పాలవలస రాజశేఖర్ మృతి చెందిన విషయం తెలుసుకొని పరామర్శించారు. రాజశేఖర్తో తనకున్న అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. పరామర్శించిన వారిలో మాజీ ఎమ్మెల్యే కళావతి, వైస్ ఎంపిపి కనపాక సూర్యప్రకాష్, పట్టణ వైసిపి అధ్యక్షులు వెలమల మన్మధరావు, బూర్జ జడ్పిటిసి బెజ్జపురం రామారావు, దుప్పాడ పాపినాయుడు, కె. మోహన్, తుమ్మగుంట శంకర్రావు తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆలయ పునఃప్రతిష్ట

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని తాళ్ళబురిడిలో సాకిగెడ్డ తీరాన పురాతన కాలం నుంచి కొలువైన గంగా పరమేశ్వర స్వామి ఆలయ పునః ప్రతిష్టా కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు హాజరై అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు బొమ్మి రమేష్, జెడ్పిటిసి బలగ రేవతమ్మ, సీనియర్ నాయకులు బలగ నాగేశ్వరరావు, స్థానిక సర్పంచ్ చప్ప రామకృష్ణ, ఎంపిపి ప్రతినిధి మజ్జి శేఖర్, వైస్ ఎంపిపి బంకురి రవికుమార్, ఆత్మ మాజీ చైర్మన్ యండ్రాపు తిరుపతిరావు, వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపిటిసి సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండల పరిధిలోని వల్లరి గుడబ గ్రామంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నామని సర్పంచ్ రౌతు గోవిందనాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా రాగోలు జేమ్స్ హాస్పిటల్కి చెందిన వైద్యులు ఉచిత మెగా వైద్య శిబిరంలో పాల్గొని తనిఖీలు నిర్వహిస్తారన్నారు. ఈ వైద్య శిబిరంలో గుండె వ్యాధులు, ఎముకులు, కీళ్ల నొప్పులు, చెవి, ముక్కు, గొంతు, సంబంధిత వ్యాధులపై ఉచితంగా తనిఖీలు నిర్వహిస్తారన్నారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్న శిబిరాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

19న వైద్య శిబిరం

పాచిపెంట: పాచిపెంట పోలీసుల ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా రాగోలు జెమ్స్ హాస్పిటల్ సౌజన్యంతో స్థానిక పిహెచ్సి, గురివినాయిడుపేట గ్రామస్తుల సహకారంతో ఈ నెల 19న నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ వెంకటసురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటలకు పాచిపెంట పోలీస్ స్టేషన్ ఆవరణంలో అన్నీ విభాగాలకు చెందిన వైద్యుల పరివేక్షణలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తామన్నారు. అనంతరం గిరిజన యువకులకు వాలీబాల్ కిట్స్ కూడా ఉచితంగా అందిస్తామని ఆయన చెప్పారు.

ఫోర్టిఫైడ్ బియ్యంతో అనేక ప్రయోజనాలు

ప్రజాశక్తి- సాలూరు

అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేసే ఫోర్టిఫైడ్ బియ్యంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఐసిడిఎస్ సిడిపిఒ విజయలక్ష్మి చెప్పారు. సోమవారం ప్రాజెక్టు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఫోర్టిఫైడ్ బియ్యంతో కలిగే ఉపయోగాల గురించి వివరించారు. ఈ బియ్యం కడిగేటప్పుడు కొన్ని నీటిలో తేలుతాయని, వాటిని పారేయరాదని కోరారు. పోషక విలువలున్న బియ్యం పంపిణీ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ బియ్యం సరఫరా చేస్తోందని చెప్పారు. గర్భిణులు, బాలింతలు అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పక్కాగా ఆరోగ్య సర్వే

వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి

ప్రజాశక్తి - సీతానగరం

వైద్య సిబ్బంది ఆరోగ్య సర్వేలు పక్కగా నిర్వహించి, వ్యాధి లక్షణాలు గుర్తించాలని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని బూర్జలో హెల్త్, వెల్నెస్ కేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి రోజూ ఆరోగ్య కేంద్రంలో ఎంతమంది వైద్య సేవలు వినియోగించుకుంటున్నారు, ఒపి రికార్డు తనిఖీ చేసి చికిత్సా వివరాలు పరిశీలించారు. దీర్ఘకాలిక రోగుల ఆరోగ్యం ఏ మేరకు మెరుగుపడుతుందో పర్యవేక్షించాలన్నారు. ఎన్సిడి సర్వేపై ఆరా తీసి ఇప్పటి వరకు పూర్తి చేసిన సర్వేలో ఎటువంటి ఆరోగ్య సమస్యలు గుర్తించారు, అలాగే కేన్సర్ స్క్రీనింగ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కేన్సర్ లక్షణాలు సకాలంలో గుర్తించడం అవసరమని, తద్వారా వ్యాధి ముప్పు తప్పించవచ్చని తెలిపారు. ముఖ్యంగా ఓరల్ కేన్సర్, సర్వైకల్ కేన్సర్, రొమ్ము కేన్సర్ లక్షణాలు గుర్తించడంపై ఎక్కువ శ్రద్ధ చూపాలన్నారు. కొత్తగా దీర్ఘకాలిక రోగులను గుర్తిస్తే త్వరగా చికిత్స అందించాలన్నారు. లెప్రసీ సర్వే, స్కూల్ హెల్త్ స్క్రీనింగ్పై ఆరా తీశారు. నిర్దేశించిన సమయానికి సర్వేలు పూర్తి చేయాలన్నారు. ఈనెల 10న జరిగిన డీవార్మింగ్ ప్రోగ్రాంలో మాత్రలు వేయబడని వారికి ఈరోజు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. గ్రామంలో ఎక్కడైనా జ్వరాలు, డయేరియా లక్షణాలు గుర్తిస్తే వెంటనే ఆరోగ్య కార్యాలయానికి తెలియజేయాలన్నారు.

తాగు నీటి స్వచ్ఛత పరీక్షలు ఎప్పటికప్పుడు నిర్వహించాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమ వివరాలు తెలుసుకున్నారు. కేంద్రంలో మందుల లభ్యత, వైద్య పరికరాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. 104 వాహనంలో మందుల లభ్యత, ఇసిజి పరికరం పనితీరు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పి.రమ్యసాయి, వైద్య సిబ్బంది గాయత్రి, నరసమ్మ,104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సూచనలు చేస్తున్న సిఇఒ శ్రీధర్ రాజా

ఎంపిడిఒ కార్యాలయాన్ని పరిశీలించిన సిఇఒ

ప్రజాశక్తి- సీతంపేట

శ్రీకాకుళం జిల్లా పరిషత్ సిఇఒ ఎల్ఎన్వి శ్రీధర్ రాజా సోమవారం సీతంపేట ఎంపిడిఒ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయంలో సిబ్బంది పనితీరుని అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణపై తగు సూచనలు చేశారు. కార్యాలయం ఆవరణలో బాదం మొక్కను నాటారు. అనంతరం వైటిసిలో పీసా చట్టంపై జరుగుతున్న శిక్షణా కార్యక్రమంలో పాల్గొని గ్రామాల అభివృద్ధి చెందడంలో ఎస్హెచ్జి గ్రూప్ సభ్యుల పాత్ర, పీసా గ్రామ సభల్లో భాగస్వామ్యం వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్ఐఆర్డి పర్యవేక్షకులు హనుమంతరావు, శ్రీకాకుళం డిపిఆర్సి లోకనాథం, శిక్షణ కార్యక్రమం ట్రేనర్స్ పంచాయతీ కార్యదర్శులు, రామకృష్ణ, పాపారావు, వినోద్, రాజశేఖర్ మండల ప్రజా పరిషత్ పరిపాలనాధికారి తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ సమస్య పరిష్కారానికి కార్యాచరణ ప్రకటించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కారానికి ఈ నెలలో జరగబోయే శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో కార్యాచరణ ప్రకటించాలని అగ్రికల్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఈవి నాయుడు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి 8 నెలలు గడుస్తున్నా అగ్రిగోల్డ్ బాధితుల కోసం చర్యలేమీ తీసుకోలేదన్నారు. మేనిఫెస్టోలో పెట్టేలా 23 వేల ఎకరాల వ్యవసాయ భూములను, లక్షల చదరపు గజాల స్థలాలను అమ్మి బాధితులందరికీ వడ్డీతో సహా న్యాయం చేయాలని, ప్రభుత్వం తక్షణమే కార్యాచరణ రూపొందించి ప్రకటించాలని డిమాండ్ చేశారు. సిఐడి అటాచ్ చేసిన అగ్రిగోల్డ్ భూముల్లో పెంచుతున్న వందల కోట్ల విలువైన ఎర్రచందనం, టేకు, జామాయిల్ వంటి విలువైన చెట్లను యధేచ్ఛగా పట్టపగలే నరికి యంత్రాలతో తరలిస్తున్నా ప్రభుత్వం బాధ్యులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. ఈ బడ్జెట్ సమావేశాల్లోనైనా సరైన నిర్ణయం తీసుకోకపోతే మరోసారి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఇటీవల అమరావతిలో జరిగిన అగ్రిగోల్డ్ బాధితుల రాష్ట్ర స్థాయి విస్తత స్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు మేరకు ఈనెల 19, 20 తేదీల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపిలకు వినతి పత్రాలు అందజేయాలని, 24న అన్ని జిల్లా కలెక్టరేట్లో వినతి పత్రాలు ఇవ్వాలని కోరారు. అప్పటికీ ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాకపోతే మార్చి 5 నుంచి పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవ్వాలని బాధితులు ఉద్దేశించి మాట్లాడారు.


ఆహార పొట్లాలు అందిస్తున్న ప్రసాదుబాబు, సర్పంచ్ సంతోషి

టిడిపి ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్

ప్రజాశక్తి- పాచిపెంట

మండల కేంద్రంలోని స్థానిక పెద్ద బజారు కూడలిలో టిడిపి మండల అధ్యక్షులు పిన్నింటి ప్రసాదుబాబు ఆధ్వర్యంలో సోమవారం అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేశారు. మండల కేంద్రానికి ఏజెన్సీ ప్రాంతాల నుండి వివిధ పనుల నిమిత్తం వచ్చిన 200 మంది గిరిజనులకు అన్నా క్యాంటీన్ ద్వారా ఉచితంగా భోజన సౌకర్యం కల్పించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి దూర ప్రాంతాల నుండి వైద్య సేవ నిమిత్తం వచ్చిన పేదలకు ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ ప్రతి సోమవారం అన్నా క్యాంటీన్ ద్వారా పేదలకు ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పి.సంతోషి కార్యకర్తలు పాల్గొన్నారు.

పీసా చట్టంపై శిక్షణ

ప్రజాశక్తి - కురుపాం

పీసా చట్టంపై సర్పంచులకు, కార్యదర్శులకు, పీసా కమిటీ సభ్యులకు తప్పని సరిగా అవగాహన కలిగి ఉండాలని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి అన్నారు. సోమవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయం వద్ద పీసా చట్టంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సామర్లకోట నుంచి ఫెసిలిటేట్ మెంబర్ పి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని పీసా చట్టంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పీసా 2011 చట్టం ప్రకారం 7 రకాల పీసా విధులు, బాధ్యతలు ఉన్నాయని వాటిని పక్కాగా కమిటీ సభ్యులు, సర్పంచులు, అధికారులు గిరిజన ప్రాంతాల్లో అమలు జరిగేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఐ.రామకృష్ణ, మండలంలో గల పీసా కమిటీ సభ్యులు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో జీడి ప్రాసెసింగ్ వద్దు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ శివారులో గల జగన్నాధపురంలోని జనావాసాలకు ఆనుకొని ఉన్న మార్కెట్ యార్డులో జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు ఐటిడిఎ అధికారులు చేస్తున్న ప్రయత్నాలు విరమించుకోవాలని సిపిఎం నాయకులు గొర్లి వెంకట రమణ(సన్యాసి), పాకల సన్యాసిరావు, బివి రమణ డిమాండ్ చేశారు. సోమవారం వారు ప్రతిపాదిత మార్కెట్ యార్డ్ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రజలతో మాట్లాడుతూ రైతులకు సంబంధించిన అనేక వ్యాపార కార్యక్రమాలు నిర్వహించే మార్కెట్ యార్డును ప్రభుత్వం నేడు రైతులకు సంబంధంలేని అనేక కార్యకలాపాలకు వినియోగించడం విచారకరమని విమర్శించారు. ఇప్పటికే మార్కెట్ యార్డులో కొంత భాగాన్ని ఎన్నికల కమిషన్ స్వాధీనం చేసుకొని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరిచారని తెలిపారు. ఇప్పుడు ఐటిడిఎ అధికారులు జీడిపిక్కల ప్రాసెసింగ్ ప్లాంట్ను జనావాసాలకు ఆనుకొని పెట్టడం వల్ల కాలుష్యం


మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

బారినపడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని తెలిపారు. కావున ఈ ప్లాంట్ను జనావాసాల్లేని ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేయవచ్చని తెలిపారు. ఈ సమస్యపై ఇప్పటికైనా అధికారులు పునరాలోచించి ఈ నిర్ణయాన్ని మార్చుకోవాలని, లేనిచో పట్టణంలోని జగన్నాధపురం, వివేకానంద కాలనీ, కొత్తవీధి తదితర ప్రాంతాల ప్రజలను ఐక్యం చేసి సిపిఎం ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

నీటి సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని దుమ్మంగి పంచాయతీ పరిధిలోని కొరడగూడ గ్రామస్తులు మంచినీటి సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి సోమవారం వినతిపత్రం అందించారు. కొరడగూడ గ్రామంలో సుమారు 25 కుటుంబాలు జీవనం సాగిస్తున్నామని, మంచినీటి సౌకర్యం లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యేకు విన్న వించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమ స్యను


వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వేసవిలో నీటి సమస్య లేకుండా పరిష్కరించే విధంగా కృషి చేస్తాన న్నారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే వారికి సూచించారు.

జంఝావతికి నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఈనెల 24 నుండి జరుగు నున్న బడ్జెట్ సమావేశంలో జంఝావతి రిజర్వాయర్ పూర్తి అయ్యే విధంగా నిధులు కేటాయించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండలంలోని కంభవలస పంచాయతీ పరిధిలోగల జంఝావతి రిజర్వాయర్ను 1976లో 24వేల ఎకరాలకు సాగు నీరు అందించే విధంగా ప్రారంభించి నేటికీ 48 సంవత్సరాలైనా కేవలం 50 శాతం పూర్తి చేయడం దారుణమన్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా దీన్ని పూర్తి చేసే పరిస్థితి కనిపించడం లేదన్నారు. ఇప్పటికైనా జంఝావతి రిజర్వాయర్ సమస్య పరిష్కరించే దిశగా బడ్జెట్లో తగినన్ని నిధులు కేటాయించాలని వీటితోపాటు తోటపల్లి నిర్వాసితులకు నిధులు కేటాయించాలని, గుమ్మిడిడెడ్డ, వన కాబడి రిజర్వాయర్ పూర్తిచేసే విధంగా నిధులు కేటాయించాలన్నారు.

గుమడ రైల్వే స్టేషన్లో సమస్యలపై వినతి

మండలంలో గుమడ రైల్వే స్టేషన్లో సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు రైల్వే జీఎంకు సాంబమూర్తితో కలిసి గుమడ సితమాంబపురం గ్రామానికి చెందిన ఎం తిరుపతిరావు, ఎం శ్రీను, ఎస్.కె కబీర్, వినతి పత్రం అందించారు. రైల్వే స్టేషన్లో రిజర్వేషన్ బుకింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు.

రోజుకు 50 ఎకరాలు ఆన్లైన్ చేయాలి : జెసి

ప్రజాశక్తి - వీరఘట్టం

రోజుకి 50 ఎకరాల్లో జిపి చేయాలని జెసి ఎస్ఎస్ శోభిక సిబ్బందిని ఆదేశించారు. సోమవారం మండలంలోని తూడి గ్రామంలో నిర్వహిస్తున్న భూ రీసర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో రెండు బృందాలుగా వీడి త్వరితగతిన సర్వే పూర్తి చేయాలన్నారు. సర్వేలో ఎటువంటి తప్పిదాలకూ తావివ్వకుండా ఒకటికి రెండుసార్లు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సర్వేలో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. జెసితో పాటు పాలకొండ సభ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతు రిజిస్ట్రేషన్ పరిశీలన

సీతంపేట: మండలంలోని ఆధార్, భూమి, ఫోన్ నెంబర్ల ఫార్మర్ రిజిస్ట్రేషన్ను జాయింట్ కలెక్టర్ శోభిక పరిశీలించారు. ఈ మేరకు సోమవారం ఆమె స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని


అంతర్జాలంలో రైతుల వివరాలను పరిశీలిస్తున్న జెసి శోభిక

సందర్శించారు. రైతు రిస్ట్రేషన్ ప్రక్రియ నెమ్మదిగా ఉందన్నారు. ఇక్కడ ఆధార్తో ఫోన్ నెంబర్ లింకు లేవని, ఆధార్ సెంటర్లో ఏర్పాటు చేయాలని ఎఒ శ్రీదేవి జెసి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం భూ సర్వే వేగవంతం చేయాలని తహశీల్దార్ను ఆదేశించారు. జెసితో పాటు సబ్ కలెక్టర్ సి.యశ్వంత్కుమార్రెడ్డి, తహశీల్దార్ అప్పలరాజు, డిటి శ్రీవిద్య, ఆర్ఐ విజయగణేష్ పాల్గొన్నారు.

ఆర్ఎస్కెలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

సీతానగరం: రైతులంతా రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ను చేయించుకోవాలని ఎఒ ఎస్.అవినాష్ అన్నారు. మండలంలోని అంటిపేట, ఇప్పలవలస గ్రామాలలో సోమవారం రైతుసేవా కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులంతా వారి వన్బి, ఆధార్తో రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ సిబ్బందితో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ పని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ రిజిస్ట్రేషన్ ద్వారా రైతులకు ఖరీఫ్, రబీ సీజన్ పంటల వివరాలను నమోదు చేస్తారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికే వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని తామరకండిలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీల మస్టర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కూలీలు సమయం పాటిస్తే కూలి గిట్టుబాటవుతోందన్నారు. ప్రతి ఒక్కరికీ పని కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్ సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలోని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు సోమవారం సుడిగాలి పర్యటన చేపట్టారు. పలు వీధుల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దగ్గరుండి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

బార్నాల వీధిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని బార్నాల వీధిలో సోమవారం స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, జ్వర పీడితులు, మధుమేహ, రక్తపోటు, తదితరులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నీలానగరం గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు హుండీ చోరీకి పాల్పడ్డారు. గ్రామస్తులు తెలిపారు. సోమవారం ఉదయం ఆ మార్గం గుండా వెళ్ళిన కొంతమంది వ్యక్తులు ఆలయం తలుపులు తెరిచి ఉండడం గమనించి లోపలికి వెళ్లి చూడగా హుండీ లేకపోవడంతో చుట్టుపక్కల పరిశీలించారు. చెరువు గట్టు పక్కన పగలగొట్టిన ఉహుండీని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిసర ప్రాంతాలను పరిశీలించారు.

నేరాలు ఘోరాలు

సారా స్థావరాలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఇరిడి, పులిగూడలో నాటు సారా అమ్మకందారులపై కురుపాం ఎక్సైజ్ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఇరిడి గ్రామానికి చెందిన బిడ్డిక గుండు నుంచి 80 లీటర్ల నాటు సారా, పులిగూడకు చెందిన ఊయక కిరణ్కుమార్ నుంచి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో సారా వంటకాలు, అమ్మకాలు స్థావరాలపై దాడులు నిర్వహిస్తామని అన్నారు. అక్రమంగా నాటు సారా అమ్మకాలు జరపడం చట్టరీత్యా నేరమన్నారు.

జెసిబిని సీజ్ చేసిన మైనింగ్ అధికారులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని రేగులపాడుకు సమీపాన గల మరియగిరి కొండ వద్ద సోమవారం జెసిబితో అక్రమంగా కంకర తవ్వుతున్నట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు దాడులు నిర్వహించగా జెసిబిని పట్టుకుని సీజ్ చేసినట్లు మైనింగ్ అధికారులు తెలిపారు. ఎక్కడైనా అక్రమంగా తవ్వకాలు జరిపితే అక్రమదారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని మైనింగ్ అధికారులు తెలిపారు.